సాక్షి
వికారాబాద్
మంగళవారం ¦ 4 ¦ జూలై ¦ 2023



ఉపాధ్యాయులే..

సర్కార్ స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. 8లో▸



జీపీలకు పక్కా భవనాలు

గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో వసతులు కరువై పాలన ఇబ్బందిగా ఉండేది. 8లో▸



చినుకు లేక.. మొలక రాక

ఇటీవల కురిసిన తొలకరి జల్లులకు రైతులు వేసిన విత్తనాలు సరిగ్గా మొలవ లేదు. దీంతో ఆందోళన చెందుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా గుగులోతు లింగ్యానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌కు వచ్చి విధుల్లో చేరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై అడిషనల్ కలెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విజయ కుమారి, వివిధ శాఖల అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో 38 రెసిడెన్సియల్, 38 నాన్ రెసిడెన్సియల్‌కు సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారైతే రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. 1-6-2017 నుంచి 31-5-2018 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం రూమ్ నంబర్. ఎఫ్- 10లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారానికి ఇతర సర్టిఫికెట్లు జతచేసి, ఈ నెల 15లోపు సంబంధిత కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9908690240లో సంప్రదించాలని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు విద్యార్థుల ఎంపిక రేపు

మోమిన్‌పేట: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి బుధవారం అర్హులైన విద్యార్థులను ఎంపిక చేస్తామని ఎంఈఓ గోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సెలక్షన్స్ కొనసాగుతాయని పేర్కొన్నారు. 4, 5 తరగతుల్లో అడ్మిషన్ పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్: 94413 02140, 90003 37072 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

అనంతగిరి: అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇల్లు లేని పేదలకు ప్రజలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, బుగ్గప్ప, రామకృష్ణ, రవి, శ్రీనివాస్ సుదర్శన్, లక్ష్మి, అనంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యాగానికి తాండూరు బ్రాహ్మణులు దూరం

తాండూరు: స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్న యాగాలకు తమను ఆహ్వానించకుండా అవమానించాడని తాండూరు బ్రాహ్మణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే నివాసంలో సోమవారం నుంచి ఈ నెల 13 వరకు యాగాలు, పూజలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ క్రతువుకు రావాలంటూ తాండూరు ప్రాంతంలోని అన్ని కుల సంఘాలను కలిసి ఆహ్వానించిన ఆయన తమను విస్మరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇంటి బ్రాహ్మణులను కాదని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో యజ్ఞయాగాదులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక బ్రాహ్మణుల్లో ఎంతోమంది వేదవేదాంగాలు అభ్యసించిన పండితులు ఉన్నారన్నారు. 11 రోజుల పాటు ఎమ్మెల్యే నిర్వహించే పూజలకు తాము వెళ్లేది లేదని ప్రకటించారు.



ప్రసాదం ఉట్టితో స్తంభం ఎక్కుతున్న భక్తులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు



ఉత్సవాలను తిలకిస్తున్న భక్తులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న అనంతపద్మనాభస్వామి

వైభవంగా పెరుగుబసంతం

- పద్మనాభస్వామి వేడుకకు తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన అనంతగిరి ఆలయం

అనంతగిరి: అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీఅనంత పద్మనాభ స్వామి ఆలయంలో ఆషాఢమాస చిన్న జాతరను పురస్కరించుకుని సోమవారం వేలాది మంది భక్తుల మధ్య పెరుగుబసంతం వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరుడ వాహన సేవలో భాగంగా ఆలయ పుష్కరిణి వద్దకు వెళ్లి అక్కడ పెరుగుబసంతానికి సంబంధించిన ప్రత్యేక మహా ప్రసాదాన్ని తయారు చేసి ఉట్టిలో తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉత్సవ స్తంభంపైకి ఉట్టిని ఎక్కించారు. దాన్ని పగులగొట్టి మహా ప్రసాదాన్ని భక్తులపై చల్లారు. ప్రసాదాన్ని పంటపొలాల్లో చల్లుకునేందుకు కొందరు భక్తులు గొడుగులు తెరిచి పట్టుకున్నారు. హైదరాబాద్, బీదర్, గుల్బర్గా, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దంపతులు, ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్‌గౌడ్, బుచ్చిబాబు గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

3 పర్మిట్లు.. 30 ట్రిప్పులు!

తాండూరులో ఇసుక రవాణా మూడు పర్మిట్లు.. ముప్పై ట్రిప్పులు అనేలా మారింది. అనుమతుల పేరుతో రెచ్చిపోతున్న అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు ట్రాక్టర్లతో వెళ్లి కాగ్నాను కొల్లగొడుతున్నారు. అడ్డొచ్చిన వారిపై దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసు శాఖలు 'మామూలు'గా వ్యవహరిస్తున్నాయి.

– తాండూరు

- తాండూరులో అను'మతి'పోయేలా ఇసుక అక్రమ రవాణా
- కాగ్నాను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- అడ్డొచ్చిన వారి అంతుచూస్తామని బెదిరింపులు
- దాడులకూ వెనుకాడని పరిస్థితి
- చేష్టలుడిగిన సంబంధిత శాఖలు



కాగ్నా నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేస్తున్న కార్మికులు

❖ పాత తాండూరు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల నుంచి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. అతివేగం, అజాగ్రత్తగా కాలనీల నుంచి దూసుకుపోతున్న ట్రాక్టర్లతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. దీంతో వీఆర్‌ఏ ఎల్లప్ప గత నెల 8న పాత తాండూరు మీదుగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆపాడు. డ్రైవర్ ఫిరోజ్ వెంటనే తన ఓనర్ అబ్రార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే అక్కడకు చేరుకున్న అబ్రార్ వీఆర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. డ్రైవర్ సైతం చేయి చేసుకున్నాడు. మరోసారి తమ వాహనాన్ని ఆపితే చంపుతామని బెదిరించి ట్రాక్టర్‌తో వెళ్లిపోయారు. తీవ్రగాయాల పాలైన ఎల్లప్పను స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సదరు ట్రాక్టర్ యజమాని ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు కావడంతోనే ఇలా రెచ్చిపోయాడని ప్రజలు మండిపడ్డారు.

❖ బషీరాబాద్ మండలం నవాంద్గి కాగ్నా నదిలో నుంచి ఆరు నెలల క్రితం ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అర్ధరాత్రి గస్తీలో ఉన్న కానిస్టేబుల్ ట్రాక్టర్ ఆపే ప్రయత్నం చేశాడు. అయితే డ్రైవర్ మాత్రం కానిస్టేబుల్‌ను ఢీ కొట్టి అతివేగంగా ట్రాక్టర్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అంతలోనే అదుపు తప్పడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన కానిస్టేబుల్ ఆరు నెలలుగా విధులకు దూరమయ్యాడు.

మధ్యవర్తులను కలిస్తేనే పర్మిషన్..

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో కాగ్నా నది నుంచి ఇసుక తరలించేందుకు ఉన్నతాధికారులు వెసులుబాటు కల్పించారు. ఇదే అదునుగా తీసుకున్న అక్రమార్కులు అనుమతుల పేరిట కాగ్నా నదిని తోడేస్తున్నారు. ఒకటి, రెండు ట్రాక్టర్లకు పర్మిషన్ తీసుకుని.. పది ట్రాక్టర్లు తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారు. మరోవైపు ఇసుక అనుమతి కోసం నేరుగా తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్తే పనికావడం లేదు. మధ్యవర్తులను ఆశ్రయిస్తే కానీ అనుమతి లభించని దుస్థితి నెలకొందనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా కాగ్నా నదిలోని ఇసుకను తాండూరుతో పాటు పట్టణ శివారు ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ప్రైవేటు నిర్మాణాలు, వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఇలా లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్న అక్రమార్కులు సర్కారు ఆదాయానికి సైతం గండి కొడుతున్నారు.

అక్రమ రవాణా అడ్డాలివే..

తాండూరు నియోజకవర్గంలో 40 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న కాగ్నానది పరివాహక ప్రాంతం అక్రమార్కులకు అక్షయపాత్రగా మారింది. యాలాల మండలంలోని విశ్వనాథ్‌పూర్ శివారులో ఉన్న కాక్రవేణి నదిలోని ఇసుక నాణ్యతకు పెట్టింది పేరు. దీంతో కొంతమంది అక్రమార్కులు సిండికేట్‌గా మారి భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో తరలిస్తున్నారు. అలాగే కోకట్, అగ్గనూర్, బెన్నూర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న కాగ్నా నుంచి తాండూరుకు తరలిస్తున్నారు. బషీరాబాద్ మండలంలోని నవాంద్గి, గంగ్వార్, ఇందర్‌చెడ్, క్యాద్గిరా, తాండూరు మండలంలోని ఖాంజాపూర్, పెద్దేముల్ మండలంలోని మన్‌సన్‌పల్లి, రేగోండి గ్రామాల్లోని నది పరివాహక ప్రాంతాలు అక్రమ రవాణాకు అడ్డాగా విరాజిల్లుతున్నాయి.

నాన్న పట్టించుకోవడం లేదని..

- ఇంటర్ విద్యార్థి బలవన్మరణం
- 'ఐ మిస్ యూ ఫ్రెండ్స్' అని వాట్సాప్ స్టేటస్
- పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య



మనోహర్(ఫైల్)

కుల్కచర్ల: పదేళ్ల క్రితం తల్లి చనిపోవడం.. తండ్రి తాగుడుకు బానిస కావడం.. పెళ్లయిన సోదరుడు విడిగా ఉండడం.. కుటుంబ గొడవల కారణంగా అన్నతో మాటలు లేకపోవడంతో.. తనకెవరూ లేరని మనోవేదనకు గురైన ఓ ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన మనోహర్(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన మొబైల్ వాట్సాప్‌లో 'ఐ మిస్ యూ ఫ్రెండ్స్' అని స్టేటస్ పెట్టాడు. ఇది చూసిన చిన్నాన్న కుమారుడు భాను ప్రసాద్.. మనోహర్‌కు ఫోన్ చేశాడు. స్పందించక పోవడంతో పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే మనోహర్ చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఈ విషయాన్ని భానుప్రసాద్ మృతుడి సోదరుడు మల్లేశ్‌కు తెలియజేశాడు. మనోహర్ తన తండ్రి, స్నేహితులతోనే ఎక్కువగా సన్నిహితంగా ఉండేవాడని.. కొంత కాలంగా నాన్న మద్యానికి బానిస కావడం.. తనను సరిగ్గా చూసుకోకపోవడంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని మల్లేశ్ పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

నీళ్లపల్లిలో ఆషాఢ బోనాలు



బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు

మండలంలోని నీళ్లపల్లి గ్రామంలో సోమవారం ఆషాఢ బోనాలు తీశారు. స్థానిక మహిళలు బోనాలతో తరలివెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

– బషీరాబాద్



సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

గురు దేవోభవ

- వైభవంగా గురు పౌర్ణమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనంతగిరి: గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అర్చనలు, ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు చేశారు.

సత్యసాయి జ్ఞానకేంద్రంలో పూజలు..

పట్టణంలోని శ్రీ సత్యసాయి జ్ఞానకేంద్రంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగంలో ప్రముఖ న్యాయవాది గోపాల్‌రెడ్డి గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, ప్రతినిధులు బందెప్పగౌడ్, బసవేశ్వర్, శ్రీలతారెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీలో...

వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాలలో గురు ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్.రమణమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు కోట్లు.. రైతులకు పాట్లు



ప్రాజెక్టు అలుగు కింద కొట్టుకుపోయిన సిమెంట్ బెడ్డు

- మరమ్మతులకు నోచుకోని 'కొంపెట్‌పల్లి'
- ముళ్ల పొదలతో పూడుకుపోయిన ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు
- చెరువులో, కట్టపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- నిండానీళ్లున్నా.. చివరి ఆయకట్టుకు అందని దుస్థితి

మర్పల్లి: నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, ప్రాజెక్టులు మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రభుత్వం ఓ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా చెరువుల మరమ్మతుకు కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మొక్కుబడిగా మరమ్మతులు చేసి, చేతులు దులుపుకొన్నారు.వారికి రావాల్సిన కోట్లాది రూపాయల బిల్లులతో జేబులు నింపుకొన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో రూ.కోటి నిధులతో కొంషెట్‌పల్లి ప్రాజెక్టును నిర్మించారు. తొలినాళ్లలో సుమారు 1,250 ఎకరాల ఆయకట్టుకు నీరందేది. ఆ తర్వాత కాల్వల మరమ్మతు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందిన దాఖలు లేవు.

చెరువులో నీళ్లున్నా..

2014లో ప్రాజెక్టు కాల్వల మరమ్మతులతో పాటు సీసీ పనులకు రూ.1కోటి 76 లక్షలు మంజూరు చేశారు. టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు ముగించాడు. ప్రస్తుతం కాల్వలు ముళ్ల పొదలు, గడ్డి, అలంతో మూసుకుపోయాయి. చెరువులో పుష్కలంగా నీరున్నప్పటికీ తూముల ద్వారా వదిలిన నీరు చివరి ఆయకట్టుకు వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. గతేడాది కురిసిన అకాల వర్షాలతో అలుగుపై నిర్మించిన బెడ్ 120 మీటర్ల మేర కొట్టుకుపోయింది. దీంతో అలుగుకు సైతం పగుళ్లు వచ్చాయి. ఎడమ కాల్వతో పాటు చెరువులో సైతం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

మొక్కుబడిగా చెరువుల పండుగ

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన చెరువుల పండుగను ఇక్కడ మొక్కుబడిగానే ముగించారు. కనీసం చెరువు కట్టపై పెరిగిన చెట్లు, మొక్క కంపను సైతం తొలగించలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నప్పటికీ ఆయకట్టు పొలాలు మాత్రం బీళ్లుగా మారాయి. ప్రాజెక్టులో చేపల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే తమ నుంచి పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: పట్టణ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ, అధ్యాపకులుగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఈ బలరాం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 6వ తేదీ సాయంత్రం 4గంటలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆంగ్లం, గణితం, జంతుశాస్త్రం, పీజీటీలో తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించి పీజీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. టీజీటీలో గణితం సబ్జెక్టుకు డిగ్రీ, బీఈడీ కలిగి ఉండాలని, ఆర్ట్ అండ్ క్రాఫ్టుకు సంబంధించి డిగ్రీ తోపాటు టెక్నికల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఫిజికల్ డైరెక్టర్‌కు డిగ్రీ, బ్యాచిలర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 83339 25370ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఏడీఏ రుద్రమూర్తి



తాండూరు రూరల్: విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్ దుకాణ యజమానులు రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఏడీఏ రుద్రమూర్తి ఆదేశించారు. సోమవారం ఆయన పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. రైతులకు కంపెనీ విత్తనాలే విక్రయించాలని, తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించరాదని సూచించారు. తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో ప ట్టా పాసుపుస్తకాలు ఉన్న అన్నదాతలకు రైతుబంధు డబ్బులు జమ అవుతున్నట్లు ఆయన తెలిపారు.

విగ్రహాలకు రక్షణ కల్పించండి



విగ్రహాల చోరీపై ఎస్ఐతో మాట్లాడుతున్న ఆంజనేయులు

తాండూరు రూరల్: ఆలయాల్లోని దేవత విగ్రహాలకు రక్షణ కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు కోరారు. సోమవారం గౌతపూర్ శివారులో ఉన్న కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మధుసూదన్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని జినుగుర్తి శివారులో శ్రీ రామలింగేశ్వరస్వామి గర్భగుడిలో భవాని మాత విగ్రహం చోరికి గురైందన్నారు. మూడు నెలల క్రితం జినుగుర్తి గేటు వద్ద దత్తత్రేయ విగ్రహం కూడా దొంగిలించారని చెప్పారు. తరచూ విగ్రహాలు చోరికి గురికావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి విగ్రహాలను ఆలయాలకు అందజేయాలని ఆయన కోరారు. ఇకపై చోరీలు జరగకుండా నిఘా పెంచుతామని ఎస్ఐ హామీ ఇచ్చారు.

వైభవంగా అతిరుద్ర మహాయాగం



గజరాజుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, కుటుంబసభ్యులు

తాండూరు: స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో సోమవారం అతిరుద్ర మహాయాగం, రాజశ్యామల యాగాలు ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరగనున్న యాగంలో భాగంగా తొలి రోజు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో గోపూజ, గజపూజ నిర్వహించారు. అనంతరం అతిరుద్ర యాగం జరిగింది. పూజలో ఎమ్మెల్యే బంధువులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ఇన్‌చార్జ్‌లుగా..

- ఆరు ఉన్నత పాఠశాలల్లో ఒక్క స్కూల్‌కే జీహెచ్‌ఎం
- ఏళ్ల తరబడి ఐదు పోస్టులు ఖాళీ
- అదనపు బాధ్యతలతో ఇబ్బందులు



బాలంపేట ఉన్నత పాఠశాల

దౌల్తాబాద్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పాఠశాలల నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. హెచ్‌ఎం పోస్టులు ఖాళీ అయ్యి ఏళ్లు గడుస్తున్నా నేటికీ భర్తీ చేయడం లేదు. మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు (దౌల్తాబాద్, బలంపేట, చల్లాపూర్, కుదురుమళ్ల, బిచ్చాల, గోకఫసల్‌వాద్) ఉన్నాయి. వీటిలో కేవలం గోకఫసల్‌వాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మాత్రమే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. మిగిలిన 5 పాఠశాలలకు జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆయా పాఠశాలలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు తమ సబ్జెక్టులను బోధిస్తునే పాఠశాల నిర్వహణ చూసుకుంటున్నారు. దీనికి తోడు ప్రతి హెచ్‌ఎంకు కాంప్లెక్స్ పరిధిలో పది నుంచి పదిహేను పాఠశాలలను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఒకవైపు హెచ్‌ఎంగా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలపై పర్యవేక్షకుడిగా తమ సబ్జెక్టును విద్యార్థులకు బోధించాల్సి ఉంది. పనిభారం పడి బోధనా పరంగా ఆయా సబ్జెక్టులకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుంది.

భర్తీకి నోచుకోని జీహెచ్‌ఎం పోస్టులు

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం భర్తీ చేయడంలేదు. ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం, ఉన్న జీహెచ్‌ఎంలు పదవీ విరమణ పొందుతుండడంతో నెల నెలకు జీహెచ్‌ఎంల పోస్టులు ఖాళీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉన్నత పాఠశాలల్లో కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే విద్యాబోధన చేస్తారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా స్కూల్ అసిస్టెంట్ ఉంటుండడంతో బాధ్యతల విషయంలో తోటి ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరించలేని పరిస్థితులు ఉన్నాయి. దీనికి తోడు ప్రమోషన్లు, ప్రక్రియ చేపట్టకపోవడంతో చాలా మంది స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెచ్‌ఎంలు కావాలన్న కల నెరవేరకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. మండల విద్యాధికారి పోస్టు సైతం పది సంవత్సరాలుగా ఖాళీగా ఉండడం గమనార్హం. దీంతో దౌల్తాబాద్, పెద్దేముల్, తాండూరు మూడు మండలాలకు ఒక్కరే ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులు సైతం ఖాళీ

మండలంలో 36 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 126 ఎస్జీటీ పోస్టులకుగాను 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీఈటీ 3 పోస్టులకుగాను 2 ఖాళీ ఉన్నాయి. 59 స్కూల్ అసిస్టెంట్లకు గాను 22 ఖాళీలు ఉన్నాయి. ఎల్‌ఎఫ్‌ఎల్10 పోస్టులకుగాను 6 ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం



మండలంలో ఐదు ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంల పోస్టులతోపాటు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. ప్రస్తుతం హెచ్‌ఎంల నియామకాలు జరగకపోవడంతో స్కూల్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్



అద్భుత దృశ్యం ఆవిష్కృతం

అనంతగిరి గుట్టల్లో సోమవారం సాయంత్రం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. గుట్టలోని నంది విగ్రహం, శివలింగం మధ్య సూర్యుడు అస్తమించే వేళ కాంతి అబ్బుర పరిచింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. - ధారూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పేదింటి ఆడ పిల్లలకు ముఖ్యమంత్రి కేసీఆర్ మేనమామలా వారి పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. నవాబుపేట ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం 15 గ్రామాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల పెళ్లిళ్లు ఎంత భారమో తెలిసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. అందుకే అర్హులైన పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికీ ఏదో రూపంలో మేలు జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సర్పంచులు రత్నం, పర్మయ్య, శ్రీలత, స్వరూప, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, ప్రకాశం, రాంచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి హరితహారం, గృహలక్ష్మి, సీఎంఆర్ రైస్, బీసీ కుల వృత్తుల వారికి ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం వంటి వాటిపై కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ సమీక్ష అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు సకాలంలో అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్నందున హరితహారం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం లోపు బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందించే జాబితాను అందజేయాలన్నారు. జిల్లాలో 2,696 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయని వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు అర ఎకరా అటవీ భూమిని వినియోగించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, కలెక్టర్ లింగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి వస్తేనే మార్పు

కుల్కచర్ల: యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే మార్పు సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, పార్టీ తమిళనాడు విస్తారక్ వీటీ అరుసు పేర్కొన్నారు. సోమవారం కుల్కచర్లలో ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత సమస్యలపై పోరాటం చేయాలని, అటువంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం వల్ల అవినీతిపై పోరాటం చేయగలుగుతారని అన్నారు. అబద్ధాలతో అవకాశవాద రాజకీయాలు చేసే వ్యక్తులను యువత గ్రహించి, సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని అన్నారు. తెలంగాణలో బీజేపీకే భవిష్యత్ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షులు మైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యువకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

రైతులు నష్టపోతున్నా పట్టించుకోరా?

- యథేచ్ఛగా నకిలీ విత్తనాలు విక్రయిస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీత
- తనిఖీలపై ముందస్తు సమాచారం ఇస్తారా..!
- ఏఓ వసంతపై మండల సభ్యుల ఆగ్రహం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

మర్పల్లి: మండలంలో ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు, నిషేధిత క్రిమి సంహారక మందులు విక్రయిస్తున్న పట్టించుకోరా అని ఏఓ వసంతపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లలిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతుండగా బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి కలుగజేసుకొని మండల కేంద్రంలో కొంత మంది దుకాణాదారులు నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్షం రోజుల క్రితం మర్పల్లిలోని ఓ విత్తనాల డీలర్ కర్ణాటక రాష్ట్రం నుంచి నిషేధిత క్రిమి సంహారక మందును కొనుగోలు చేసి ఇక్కడ విక్రయించినట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని మీకు తెలియజేస్తే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అంతేకాకుండా సదరు దుకాణంలో తనిఖీలు చేయనున్నట్లు ముందస్తు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. మీరు సమాచారం ఇవ్వడం వల్లే సదరు డీలర్ నిషేధిత క్రిమి సంహారక మందును మరో చోటికి తరలించాడని ఏఓ వసంతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ లలిత, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కలుగజేసుకొని మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేసి నకిలీ విత్తనాలు, నిషేధిత క్రిమి సంహారక మందులు విక్రయిస్తుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మిషన్ భగీరథపై చర్చ జరిగింది. పలు గ్రామాల్లో పైప్‌లైన్ కోసం తీసిన గుంతలను పూడ్చినా సీసీ బెడ్ వేయలేదని సభ దృష్టికి తెచ్చారు. మిషన్ భగీరథ పనుల కోసం ప్రభుత్వానికి రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామని ఆ శాఖ ఏఈ సభకు వివరించారు. గ్రామాల్లోని కొత్త కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బూచన్‌పల్లి సర్పంచ్ జయ, పంచలింగాల సర్పంచ్ సురేందర్‌రెడ్డి ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తెచ్చారు. స్తంభాలు కోసం ప్రతిపాదనలు పంపామని, రాగానే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సోయేల్, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, సూపరింటెండ్ కృష్ణకుమార్, ఎంపీఓ మహేశ్, ఎంఈఓ విద్యాసాగర్, ఏఓ వసంత, ఆర్ఐ మాధవరెడ్డి ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలపై ఏఓ వసంతను నిలదీస్తున్న ఎంపీటీసీ బాల్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బిహార్ రాష్ట్రానికి చెందిన హరీంద్రా చౌహాన్(30), కృష్ణ చౌహాన్(28) రావిర్యాలలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు కూరగాయలు కొనేందుకు ద్విచక్రవాహనంపై రావిర్యాలలోని ఓ దుకాణానికి వెళ్లారు. తిరిగి వెళ్తున్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడగా.. హరీంద్రకు స్వల్ప గాయాలయ్యాయి.

భారీ వర్షం.. తెగిన కుంటలు

దౌల్తాబాద్: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం పడింది. దీంతో చిన్న చిన్న చెరువులు. కుంటలు పొంగిపొర్లాయి. అలాగే పాటుకాల్వలు, కుంటలు తెగిపోయాయి. యాంకి గ్రామ సమీపాన ఉన్న గుండ్లకుంట తూము తెగిపోయింది. అలాగే సురాయిపల్లి ఇండాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు తెగిపోవడంతో ఆ రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏకధాటి రాత్రి వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పొంగిపొర్లుతున్న చింతల్ చెరువు

భవానీమాతకు ప్రత్యేక పూజలు

దామర్‌చెడ్‌లో వెలసిన భవానీమాతకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శంకరస్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారిని సుందరంగా ముస్తాబు చేశారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- బషీరాబాద్



భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

పంచాయతీలకు పక్కా భవనాలు

జిల్లాలో 269 జీపీలకు నిధులు

- ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద 55 గ్రామాల ఎంపిక
- ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున మంజూరు



అద్దె భవనంలో గొడుగోనిపల్లి పంచాయతీ కార్యాలయం

దోమ: గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో వసతులు కరువై పాలన ఇబ్బందిగా ఉండేది. సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకంతోపాటు ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద సొంత భవనాలు నిర్మించుకోవాలని ఆదేశించింది. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 269 పంచాయతీలకు ఉపాధి హామీ పథకం ద్వారా, మరో 55 పంచాయతీలకు ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద నిధులు మంజూరయ్యాయి. దోమ మండలంలో 23 గ్రామ పంచాయతీలకు నిధులు విడుదలయ్యాయి. దీంతో ఐనాపూర్, బడెంపల్లి, బట్లచందారం, బుద్లాపూర్, దాదాపూర్, దోమ, దొంగ ఎన్కేపల్లి, దొర్నాల్‌పల్లి, గంజిపల్లి, గొడుగోనిపల్లి, గొట్లచెల్కతండా, గూడూర్, గుండాల్, కిష్టాపూర్, కొండాయపల్లి, కొత్తపల్లి, మల్లేపల్లి, మోత్కూర్, మైలారం, పాలేపల్లి, పెద్దతండా, పోతిరెడ్డిపల్లి, శివారెడ్డిపల్లి గ్రామాల్లోని పంచాయతీలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. పనులు ప్రారంభించాలని ఇప్పటికే ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అధికారులు సూచించారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద దిర్సంపల్లి తండా, పెద్దతండా, చిన్న తాండ, గొన్యనాయక్ తండా, పలుగు తండా ఎంపిక కాగా పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

త్వరలో పనులు



పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఉన్న భవనం చిన్నది కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. సభలు, సమావేశాలు నిర్వహించలేకపోతున్నాం. ఉపాధి హామీ పథకం కింద భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులను ప్రారంభిస్తాం.

– రాజిరెడ్డి, సర్పంచ్, దోమ

అన్ని హంగులతో భవనాలు



పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వీటితో అన్ని హంగులతో భవనాలు నిర్మించుకోవాలి. నిధులు మంజూరైన సర్పంచులకు ఇప్పటికే సమాచారం అందించాం. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.

– జయరాం, ఎంపీడీఓ, దోమ

27 జీపీలకు నిధులు



మండలంలోని 27 జీపీల్లో నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించి పనులు మొదలయ్యేలా చూస్తాం. సర్పంచులు సకాలంలో పనులు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తేవాలి.

– మణికుమార్, పంచాయతీ రాజ్ ఏఈ, దోమ

కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు అన్ని విధాల ప్రయత్నాలు చేశారని, అయినప్పటికి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో భారీగా తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయిందని, తొమ్మిదేళ్ల పాలనలో దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు రుణమాఫీ ఇలా చెప్పుకుంటుపోతే బీఆర్ఎస్ మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. అభివృద్ధి పనుల పేరుతో శిలాఫలకాలు వేయడం, తిరిగి చూడకపోవడం దారుణమన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, నరేందర్, రామస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.